ప్రతి అక్షరం ప్రజాహితం

RNI TITLE CODE: 16425

www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి
నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ
పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు
ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్లు,
మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006
9494220260

ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

సంపుటి -01 సంచిక - 212 సోమవారం 25 మార్చి 2024, ఎడిటర్: సీఎం. శ్రీనివాస్ , పేజీలు - 4 , వెల -03/-

# జైలు నుండి పరిపాలన చేయనున్న కేజ్రీవాల్ ?



**ఆంధ్ర ప్రగతి/న్యూఢిల్లీ మార్చి 24:** జైలు నుంచే ఢిల్లీ సీఎంగా అరవింద్ కేజ్రీవాల్ పరిపాలనను కొనసాగిస్తారని ఆప్ నేతలు స్పష్టం చేస్తున్నారు. ఈనేపథ్యంలో తాజాగా శనివారం సాయంత్రం ఆప్ సీనియర్ నేత, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్ అదే తరహా కీలక వ్యాఖ్యలు చేశారు. "కేజ్రీవాల్ విడుదలయ్యే దాకా జైలు నుంచే ఢిల్లీని పరిపాలిస్తారు. జైల్లో సీఎం కార్యాలయం ఏర్పాటుకు కోర్టు నుంచి అనుమతి తీసుకుంటాం" అని ఆయన చెప్పారు. జైలు నుంచి ముఖ్యమంత్రి పరిపాలన చేయకూడదని ఎక్కడా చెప్పలేదు. అయితే జైలుకు వెళ్లినంత మాత్రాన ఏ వ్యక్తి కూడా నేర స్థుడు కాదని చట్టం చెబుతోంది. ఢిల్లీ ప్రభుత్వాన్ని నడిపేందుకు జైల్లోనే కార్యాలయం ఏర్పాటు చేయిం చాలని సుప్రీంకోర్టు, హైకోర్టు నుంచి అనుమతి తీసుకుంటాం" అని భగవంత్ మాన్ తెలిపారు. ఆమ్‌ఆద్మీ పార్టీలో కేజ్రీవాల్ స్థానాన్ని ఏ ఒక్కరూ భర్తీ చేయలేరని ఆయన స్పష్టం చేశారు. ఇక కేజ్రీవాల్ జైలు నుంచి పరిపాలన చేయడం సాధ్యమయ్యే విషయమేనని న్యాయ నిపుణులు అంటున్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏ-1 ముద్దాయిగా మాజీ ఐపీఎస్ ప్రభాకర్ రావు..?



**ఆంధ్ర ప్రగతి/హైదరాబాద్ మార్చి 24:** తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు రేపుతోన్న ప్రజా ప్రతినిధుల ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ఎస్ఐబీ మాజీ చీఫ్, మాజీ ఐపీఎస్ ప్రభాకర్ రావు పేరును పోలీసులు ఏ-1 నిందితుడిగా చేర్చారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడైన ఎస్ఐబీ సస్పెండ్ డీఎస్పీ ప్రణీత్ రావును ఏ-2 గా పేర్కొన్నారు. ఇదే కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న రాచకొండ మాజీ డీసీపీ రాధా కిషన్ ఏ-3, ఎస్పీలు భుజంగ రావు ఏ-4, తిరుపతన్న ఏ-5, మరో ప్రైవేట్ వ్యక్తిని ఏ-6 గా చేర్చారు. ప్రైవేట్ వ్యక్తుల ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావే కీలక సూత్రధారి అని పోలీసులు నిర్ధారించారు. ప్రభాకర్ రావు కనుసన్నల్లోనే ప్రజా ప్రతినిధుల ఫోన్ల ట్యాపింగ్ జరిగిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత ప్రభాకర్ రావు ఆదేశాల తోనే ప్రణీత్ రావు ఫోన్ ట్యాపింగ్ డివైజ్‌లు, డేటా, హార్డ్ డిస్కులను ధ్వంసం చేశాడని పోలీసులు తేల్చారు. ప్రణీత్ రావు ధ్వంసం చేసిన డేటాను రీట్రీవ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

# చల్లా సోదరుడు టిడిపిలో చేరిక



**ఆంధ్ర ప్రగతి/అమరావతి మార్చి 24:** దివంగత నేత చల్లా రామకృష్ణారెడ్డి సోదరుడు,అవుకు కేడీసీసీ బ్యాంకు చైర్ పర్సన్ చల్లా విజయభాస్కర్ రెడ్డి, ఆయన బామ్మర్ది కాశీపురం మోట్ల రామిరెడ్డి వైకాపాను వీడి టిడిపిలో శనివారం అమరావతిలోని తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు సమక్షంలో బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే, తెదేపా అభ్యర్థి బీసీ జనార్దన్ రెడ్డితో కలిసి తెదేపాలో చేరిక.

# తెలుగుదేశం పార్టీతోనే మాదిగల శాశ్వత బంధం

- టీడీపీ గెలుపుతోనే మాదిగల గెలుపు-టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు - ఉండవల్లిలో టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుతో ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ భేటీ. - ఎన్డీయేకు మద్దతు ప్రకటించిన మంద కృష్ణ మాదిగ - దళితులకు వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన పథకాలు తిరిగి ప్రారంభించాలని కోరిన మందకృష్ణ



**ఆంధ్ర ప్రగతి/అమరావతి మార్చి 24:** తెలుగుదేశం పార్టీతో మాదిగలది శాశ్వత బంధం అని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. మాదిగ వర్గ ప్రజల అభ్యున్నతికి మొదటి నుంచీ పనిచేసిన పార్టీ తెలుగుదేశం అని చంద్రబాబు అన్నారు. తెలుగుదేశం విజయంలో మాదిగలు కీలక పాత్ర పోషించాలని చంద్రబాబు అన్నారు. ఉండవల్లిలో టీడీపీ అధినేతతో మందకృష్ణ మాదిగ, ఎంఆర్పిఎస్ నేతలు భేటీ అయ్యారు. చంద్రబాబు నాయుడుకు పలు అంశాలపై వినతిపత్రం ఇచ్చారు. రేపు కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత మొట్ట మొదటి సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్మానం చేయాలని మందకృష్ణ కోరారు. రాజ్యాంగ బద్ద సంస్థల్లో మాదిగ వర్గానికి తగు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అలాగే అన్ని కార్పొరేషన్ లలో, నామినేటెడ్ పదవుల్లో మాదిగ వర్గానికి పెద్ద ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. వైసీపీ ప్రభుత్వం ఎస్సీలకు రద్దు చేసిన అన్ని పథకాలు తిరిగి ప్రారంభించాలని విన్నవించారు. ఎన్డీయేకు తమ మద్దతు ఉంటుందని మంద కృష్ణ తెలిపారు. చంద్రబాబు మాట్లాడుతూ....40 ఏళ్లుగా పార్టీని మాదిగ సామాజికవర్గం ఆదరిస్తోందని అన్నారు. అలాంటి మాదిగ వర్గాన్ని పైకి తెచ్చేందుకు తాను ఎప్పుడూ ప్రాధాన్యం ఇస్తానని చెప్పారు. తెలుగుదేశం గెలుపు మాదిగల గెలుపు అవుతుందని అన్నారు. ప్రభుత్వంపై తెలుగు దేశం ఎంత గట్టిగా పోరాడుతుందో....అంతకంటే గట్టిగా ఎంఆర్పిఎస్ పోరాటం చేస్తోందని అన్నారు. మాదిగ సామాజికవర్గాన్ని అధికారంలో భాగస్వాములు చేస్తా అని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాదిగ సమస్యలపై చంద్రబాబుతో మందకృష్ణ ప్రత్యేకంగా చర్చించారు. అధికారంలోకి వచ్చిన తరవాత మాదిగ వర్గానికి న్యాయంచేయాలని కోరారు. దళితులపై వైసీపీ ప్రభుత్వ దమనకాండను ఎదుర్కోవడంలో మందకృష్ణ చేస్తున్న పోరాటాన్ని చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు.

# ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు తీవ్ర అస్వస్థత.. ఆస్పత్రిలో చేరిక.!




**ఆంధ్ర ప్రగతి/అమరావతి మార్చి 24:** ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ శనివారం (మార్చి 23) ఉన్నట్టుండి ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. దీంతో వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది ఆయనను విజయవాడలోని మణిపాల్ ఆసుపత్రికి హుటాహుటీన తరలించారు. ఆస్పత్రిలో వైద్యులు గవర్నర్‌కు చికిత్స అందిస్తున్నారు. గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు వైద్య పరీక్షలు చేసి, ఎండోస్కోపీ నిర్వహించినట్లు సమాచారం. ప్రస్తుతం గవర్నర్ ఆరోగ్యం నిలకడగానే ఉందని, వైద్యులు చికిత్స కొనసాగిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ గవర్నర్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ భద్రతా సిబ్బంది తెలియజేశారు. గవర్నర్ అశ్వస్థతకు గురైన వెంటనే సత్వర చర్యలు తీసుకున్నామని, సత్వర వైద్య సదుపాయాన్ని అందించినట్లు తెలిపారు. కాగా, గవర్నర్ హఠాత్తుగా అనారోగ్యానికి గురి కావడానికి గల కారణాలు మాత్రం ఇంకా తెలియరాలేదు. ఈ మేరకు ఏపీ రాజ్‌భవన్ అధికారికంగా ప్రకటన విడుదల చేసింది. గవర్నర్ అబ్దుల్ నజిర్ ఏడాదికాలంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గవర్నర్‌గా సేవలందిస్తున్నారు. గతంలో 2017 నుంచి 2023 వరకు ఆయన సుప్రీం కోర్టులో జడ్జిగా పని చేసిన సంగతి తెలిసిందే.

# తిరుమల శ్రీవారి కోసం పోటెత్తిన భక్తులు..!



**ఆంధ్ర ప్రగతి/తిరుపతి మార్చి 24:** శ్రీవారి దర్శనం కోసం తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఉచిత సర్వ దర్శనానికి అన్ని కంపార్ట్ మెంట్లు నిండి బయట క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు. టోకెన్ లేని భక్తుల సర్వదర్శనానికి 24 గంటల సమయం పడుతుందని టిటిడి పేర్కొంది. నిన్న శ్రీవారిని దర్శించుకున్న 72,986 మంది భక్తులు దర్శించుకున్నారు. 33,482 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. రూ.300 ప్రత్యేక దర్శనానికి 4 గంటల సమయం పడుతోందని వెల్లడించింది. మరోవైపు.. టైమ్ స్లాట్ ఎస్ఎస్‌డి దర్శనం కోసం 10 కంపార్ట్‌మెంట్‌లలో భక్తులు వేచి ఉండగా.. 5 గంటల సమయం పడుతోంది. శ్రీవారి హుండీ ఆదాయం 2.79 కోట్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

# ఏపీలో ఎన్నికలు ఆలస్యం... వైసీపీకి లాభమా..? నష్టమా..?



**ఆంధ్ర ప్రగతి/అమరావతి మార్చి 24:** ఎన్నికలు ఆలస్యం... వైసీపీకి లాభమా నష్టమా అనే విషయంపై..!ఇప్పుడు ఎక్కడ చూసినా అదే చర్చ జరుగుతోందా? ఎన్నికల ఆలస్యం అధికార పార్టీ వైసీపీకి ఇబ్బందిగా మారనుందా? అంటే.. ఔననే అంటున్నారు పరిశీలకులు. సాధారణంగా షెడ్యూల్ విడుదల చేసిన తర్వాత.. నెల రోజుల్లో ఎన్నికలు పూర్తయితే. అధికార పార్టీ చేసిన కార్యక్రమాలు, ఇచ్చిన పథకాలు ప్రజలకు అంతో ఇంతో గుర్తుంటాయి. కానీ, ఇప్పుడు ఏకంగా 60 రోజుల షెడ్యూల్. ఏపీకి మే 13న ఎన్నికలు , జూన్ 4న కౌంటింగ్. ఇంత సుదీర్ఘ నిడివి ఉన్న కారణంగా వైసీపీకి ఇబ్బందులు తప్పవనే వాదన వినిపిస్తోంది. సాధారణంగా ఎన్నికలు ఆలస్యమైతే అధికార పార్టీకి ఇబ్బంది ఉంటుంది. ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతుందేమోనన్న ఆందోళన వారిలో ఉంటుంది. గత ఏడాది వర్షాలు సరిగ్గా లేవు. కరెంట్ కోతలు ఉండే అవకాశం ఉంది. ఆపద్ధర్మ ప్రభుత్వానికి అప్పులు పుట్టే అవకాశం తక్కువ. ఇలాంటి సందర్భాల్లో ప్రజలకు ఇవ్వాల్సిన ప్రయోజనాలు ఆగిపోతే ఇబ్బంది అవుతుంది. కరెంట్ కోతలు లేకుండా చూడటం

వివరాలు 2లో

# వైసిపికి మరో షాక్.. కాంగ్రెస్‌లో చేసిన వైసీపీ కీలక నేత..!



**ఆంధ్ర ప్రగతి/అమరావతి మార్చి 24:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్నికలకు ఇంకా 50 రోజులు మాత్రమే సమయం ఉంది. దీంతో అధికారంలో ఉన్న వైసీపీ ఒక్క అనకాపల్లి పార్లమెంట్ మినహా మిగతా అసెంబ్లీ మరియు పార్లమెంట్ స్థానాల అభ్యర్థులు ప్రకటించడం జరిగింది. ఈ క్రమంలో కొంతమంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లు రాలేదు. సో టికెట్ రాని వాళ్ళలో కొంతమంది పార్టీలోనే కొనసాగుతూ ఉండగా మరి కొంతమంది ఇతర పార్టీలలోకి వెళ్లిపోతున్నారు. ఈ రకంగానే చింతలపూడి వైసీపీ ఎమ్మెల్యే ఎలీజా ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల సమక్షంలో ఎలీజా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఎలీజాకు కాంగ్రెస్ కండువా

వివరాలు 2లో

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# బిజెపిలో చేరబోతున్న గాలి జనార్దన్ రెడ్డి.. ముహూర్తం ఖరారు..!

**ఆంధ్ర ప్రగతి/న్యూఢిల్లీ మార్చి 24:** మైనింగ్ కింగ్ గాలి జనార్దన్ రెడ్డి సొంతగూటికి తిరిగి వస్తున్నారు. గతంలో బీజేపీ పార్టీలో ఉన్న ఆయన కర్ణాటక రాజ్య ప్రగతిపక్ష(కేఆర్పీపీ) పేరుతో కొత్త పార్టీ స్థాపించి, గతేడాది కర్ణాటక రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచాడు.అయితే, లోక్‌సభ ఎన్నికల ముందు ఆయన బీజేపీలో చేరుతున్నారు. మార్చి 25న కాషాయ కండువా కప్పుకోనున్నారు. "నా మద్దతుదారులను సంప్రదించిన తర్వాత, నేను నిర్ణయం తీసుకున్నాను. రేపు ఉదయం 10 గంటలకు నేను తిరిగి బిజెపిలో చేరుతున్నాను" అని మీడియాకు వెల్లడించారు. బళ్లారి లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి బి



శ్రీరాములుకు మద్దతు ఇస్తానని చెప్పారు. మాజీ మంత్రి, బీజేపీ నేతగా ఉన్న శ్రీరాములు 2023 బళ్లారి అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి ఓడిపోయారు. బీఎస్ యడియూరప్ప నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వంలో గాలి జనార్దన్ రెడ్డి మంత్రిగా పనిచేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన సోదరులైన హరపనహల్లీ, బళ్లారి సిటీ నుంచి బీజేపీ తరుపున పోటీ చేసిన కరుణాకర్ రెడ్డి, సోమశేఖర రెడ్డి ఓటమిలో కీలక పాత్ర పోషించారు. బళ్లారి సిటీలో తన సోదరుడికి పోటీగా గాలి జనార్దన్ రెడ్డి తన భార్య అరుణ లక్ష్మీని పోటీకి నిలపెట్టాడు. దీంతో ఈ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి నారా భరత్ రెడ్డి విజయం సాధించారు.

# సీఎం జగన్‌కు షాక్.. బిజెపిలో చేరిన వైసీపీ ఎమ్మెల్యే..!

**ఆంధ్ర ప్రగతి/అమరావతి మార్చి 24:** ఏపీలో ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే వెలగపల్లి వర ప్రసాద్ రావు ఆ పార్టీకి గుడ్ బై చెప్పేశారు.ఈనెల 24ఆదివారం బీజేపీలో చేరారు. కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ సమక్షంలో బీజేపీ కండువా కప్పుకున్నారు. ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు గత ఎన్నికల్లో గూడూరు అసెంబ్లీకి పోటీ చేసి గెలుపొందారు. అయితే వచ్చే ఎన్నికల్లో గూడూరు అభ్యర్థిగా ఎమ్మెల్సీ మేరిగ మురళీధరరావును కేటాయించింది. ఈ క్రమంలో వెలగపల్లి వరప్రసాద్ రావు వైసీపీని వీడాలని నిర్ణయించుకున్నారు. అనంతరం టీడీపీ, జనసేన నేతల్లోకి టచ్‌లోకి వెళ్లారు. అక్కడ టికెట్ హామీ లభించకపోవడంతో ఎమ్మెల్యే వర ప్రసాద్ రావు బీజేపీ ఏపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరితో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. అయితే వచ్చే ఎన్నికల్లో తిరుపతి లోక్‌సభ టికెట్ హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.




### స్పష్టమైన హామీ లభించినట్లేనా?

ఇకపోతే తిరుపతి లోక్‌సభను బీజేపీ ఆశిస్తోంది. పొత్తులో భాగంగా బీజేపీ ఆరు లోక్‌సభ స్థానాలను ఆశిస్తోంది. అలాగే జనసేన పార్టీ రెండు లోక్‌సభ స్థానాలలో పోటీ చేయబోతుంది. ఈ క్రమంలో ఆరు లోక్‌సభ స్థానాలపై కసరత్తు చేస్తోంది. దగ్గుబాటి పురంధేశ్వరిని కలిసిన వరప్రసాద్ వచ్చే ఎన్నికల్లో పోటీకి అవకాశం ఇవ్వాలని కోరినట్లు తెలుస్తోంది. టీడీపీ, జనసేనతో పొత్తు ఉండటంతో సీటు పై ఆలోచిస్తామని తెలిపినట్లు వెల్లడించారు. తాను గతంలో తిరుపతి నుంచి గెలిచి ఉండటంతో, తనకు తిరుపతి సీటు కేటాయించాలని కోరినట్లు తెలుస్తోంది. మరి తిరుపతి లోక్‌సభ స్థానంపై బీజేపీ హైకమాండ్ స్పష్టమైన హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పటికే తిరుపతి లోక్‌సభ స్థానం నుంచి రత్నప్రభ గత ఉపఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలయ్యారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి ఆమె పోటీ చేస్తారంటున్నారు. ఇలాంటి తరుణంలో మాజీ ఎంపీ, సిట్టింగ్ ఎమ్మెల్యే వరప్రసాద్ రావు బీజేపీలో చేరడంతో ఆయనకు స్పష్టమైన హామీ లభించినట్లు తెలుస్తోంది.

# ఏపీ అసెంబ్లీ ఎన్నికలు.. 18 మందితో జాబితా విడుదల చేసిన జనసేన

**ఆంధ్ర ప్రగతి/అమరావతి మార్చి 24:**ఏపీ ఎన్నికల కోసం జనసేన పార్టీ అభ్యర్థులను ఆదివారం ప్రకటించింది. 18 నియోజకవర్గాలకు అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేన కలిసి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. కూటమిలో జనసేన పార్టీకి 21 అసెంబ్లీ స్థానాలు, రెండు లోక్‌సభ స్థానాలు దక్కాయి. 21 స్థానాల్లో ఆదివారం 18 నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. విశాఖ సౌత్, అవనిగడ్డ, పాలకొండ నియోజకవర్గాల అభ్యర్థులకు ఇంకా పేర్లు ఖరారు చేయాల్సి ఉంది.వంశీకృష్ణ యాదవ్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయగా.. అభ్యంతరాలు వ్యక్తం కావడంతో పేరును ప్రస్తుతం పెండింగ్‌లో పెట్టినట్లు సమాచారం. పాలకొండకు పడాల భూదేవి పేరును పరిశీలిస్తున్నట్లుగా తెలుస్తున్నది. అవనిగడ్డ ఎమ్మెల్యే అభ్యర్థిగా వల్లభనేని బాలసౌరి, బీ రామకృష్ణ పేర్లను




పరిశీలిస్తున్నట్లుగా సమాచారం. కాకినాడ లోక్‌సభ అభ్యర్థిగా తంగెళ్లను ఉదయ్ శ్రీనివాస్ పేరును ప్రకటించింది. బందర్ పార్లమెంట్ స్థానానికి సైతం అభ్యర్థి ఎంపికను పెండింగ్‌లో పెట్టింది. జనసేనాని పవన్ కల్యాణ్ పిఠాపురం నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నారు. **జనసేన అభ్యర్థుల లిస్ట్..:**
నెల్లిమర్ల–లోకం మాధవి,,అనకాపల్లి – కొణతాల రామకృష్ణ,పిఠాపురం – పవన్ కల్యాణ్,కాకినాడ రూరల్ – పంతం నానాజీ,రాజానగరం – బత్తుల బలరామకృష్ణ,తెనాలి – నాదెండ్ల మనోహర్,నిడదవోలు – కందుల దుర్గేశ్,పెందుర్తి – పంచకర్ల రమేశ్ బాబు,యలమంచిలి – సుందరపు విజయ్ కుమార్,పీగన్నవరం – గిడ్డి సత్యనారాయణ,రాజోలు – దేవ వరప్రసాద్,తాడేపల్లిగూడెం – బొలిశెట్టి శ్రీనివాస్,భీమవరం – పులపర్తి ఆంజనేయులు,నరసాపురం – బొమ్మిడి నాయక్,ఉంగుటూరు – పత్సమట్ల ధర్మరాజు,పోలవరం – చిర్రి బాలరాజు.తిరుపతి – ఆరణి శ్రీనివాస్,రైల్వే కోడూరు – డాక్టర్‌యనమల భాస్కరరావు

# పాండిచ్చేరి వరకు సర్కార్ ఎక్స్‌ప్రెస్

### - వారానికి మూడు రోజులు

**ఆంధ్ర ప్రగతి/నరసాపురం, మార్చి 24:** తణుకు, భీమ వరం, ఆకివీడు మీదుగా నడిచే కాకినాడ–చెన్నై సర్కార్ ఎక్స్‌ప్రెక్స్ పాండిచ్చేరి వరకు పొడి గించారు. ప్రస్తుతం వారంలో మూడు రోజులు మాత్రమే నడుస్తోంది. ఆది కూడా ఆది, బుధ, గురువారాల్లో, తిరుగు ప్రయాణాల్లో సోమ, గురు, శుక్రవారాల్లో పాండిచ్చేరి నుంచి కాకినాడ వరకు నడుస్తోంది. ఇక మిగిలిన నాలుగు రోజులు యాధావిధిగా కాకినాడ పోర్టు నుంచి చెంగల్‌పట్టు వరకు నడుస్తోంది. ఈ రైలు 1967లో ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి ఆత్తిలి, తణుకు, భీమవరం, ఆకివీడు మీదుగానే చెన్నై వెళుతుంది. చెన్నై వెళ్లే ప్రయాణికులు ఈ రైలులో వెళ్లేందుకే ఇష్టపడుతుంటారు. కొంతకాలం నుంచి ఈ రైలును పాండిచ్చేరి వరకు పొడిగించాలని ప్రయాణికుల నుంచి విజ్ఞప్తులు వస్తున్నాయి. ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన చాలామంది పాండిచ్చేరిలో నివాసం ఉంటున్నారు. వీరు అక్కడ నుంచి రావాలంటే చెన్నై సెంట్రల్, లేదా చెంగల్ పట్టుకు రావాల్సి వస్తున్నది. సదరన్ సెంట్రల్ రైల్వే ఈరైలును పొడి గించేం దుకు అనుమతి నివ్వలేదు. దీంతో ఏళ్ళ తరబడి ఈ ప్రతిపాదన పెండింగ్‌లో ఉంది. ఈ తరుణంలో నరసాపురం నుంచి నేరుగా పాండిచ్చేరికి వారంలో ఒక్క రోజు వీక్లి ఎక్స్‌ప్రెస్ నడిపేందుకు ప్రతిపాదన పెట్టింది. దీనికి కూడా అనుమతి ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో సర్కార్ ఎక్స్‌ప్రెస్‌ను పొడి గించమని విజయవాడ డివిజన్ ఆధికారులు విజ్ఞప్తి చేశారు. దానికి సదరన్ రైల్వే పచ్చజెండా ఊపింది.ఈ ఏడాది జూలై వరకు ఈ రైలును వారానికి మూడు రోజులు నడప నున్నారు. ఆ తరువాత వారంలో అన్ని రోజులు నడుస్తోంది. ప్రస్తుం ఈరైలు పాండిచ్చేరికి ఉదయం 9.50గంటలకు చేరుకుంటుంది. తిరిగి పాండిచ్చేరిలో మధ్యాహ్నం 1.30కి బయలుదేరి మరుసటి రోజు ఉదయం భీమవరం 4.40, తణుకు 5.13కి వస్తుంది.



# రాష్ట్రాన్ని బాగు చేసే సరైన నాయకుడు చంద్రబాబు: భువనేశ్వరి



**ఆంధ్ర ప్రగతి/నెల్లూరు, మార్చి 24:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే సరైన నాయకుడు అవసరం అని, ఆ సరైన నాయకుడు చంద్రబాబేనని పేర్కొన్నారు నారా భువనేశ్వరి. శనివారం నాడు నెల్లూరు జిల్లాలో నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా మహిళలతో భువనేశ్వరి ప్రత్యేకంగా మాట్లాడారు. మహిళలు, రాష్ట్రంలో ప్రజలు అనుభవిస్తున్న కష్టాలపై ఆందోళన వ్యక్తం చేశారు. నారా భువనేశ్వరి కామెంట్స్.. 'మీలో ఒక మహిళగా మీ బాధల్లో పాలుపంచుకోవడానికి వచ్చాను. మహిళలు తమ కాళ్ల మీద తాము నిలబడటం వారికి గౌరవం. నేను హెరిటేజ్ డైరీ భాధ్యతలు తీసుకున్న తరువాత కొన్ని తప్పులు చేశాను. తప్పుల్లో నుంచి పాఠాలు నేర్చుకున్నాను. మహిళలు స్వేచ్ఛ కోసం ముందుకెళ్లాలి. కార్మికుల చమటతోనే పుట్టింది తెలుగు దేశం పార్టీ.నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటడం వల్ల కార్మికులే అధికంగా ఇబ్బంది పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం కల్తీ మద్యం తీసుకొచ్చి పేదల జీవితంతో ఆడుకుంటోంది. లక్షల మంది రోజువారి కార్మికులు గత ఐదేళ్లగా ఉపాధి అవకాశలు లేక కష్టపడుతున్నారు. తెలుగు దేశం ప్రభుత్వం హయాంలో ఇరవై లక్షల మంది రోజు వారి కూలీలకి ఉపాధి కల్పించింది. ఈ ఇదేళ్ల కాలంలో 13,500 మంది కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారు. త్వరలో మన ప్రభుత్వం వస్తుంది.' అని అన్నారు.

### సరైన నాయకుడు చంద్రబాబు..

'ప్రతి వర్గం గురించి ఆలోచించే వ్యక్తి చంద్రబాబు. మంచి సంక్షేమ పథకాలతో చంద్రబాబు మనకు అండగా నిలుస్తారు. రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకెళ్లాలి అంటే సరైన నాయకుడు అవసరం. చంద్రబాబుకు పని చేయడమంటేనే ఇష్టం. నిజం గెలవాలి కార్యక్రమం చేపట్టిన తరువాతే ప్రజల కోసం చంద్రబాబు పడుతున్న కష్టం నాకు తెలిసింది. ఆంధ్రుడిని అని చెప్పుకునేందుకు గతంలో గర్వపడే వాళ్లం.. నేడు తలదించుకోవాల్సి వచ్చింది. రాష్ట్రాన్ని డ్రగ్స్, గంజాయి ఆంధ్రాగా మార్చారు. విశాఖపట్నంలో లక్షల కోట్ల విలువ చేసే డ్రగ్స్ పట్టుకున్నారు. తప్పు చేయాలి అంటే బయపడే రోజులు పోయాయి. రాష్ట్రం, దేశం కోసం మహిళలు బయటకు వచ్చి ఓటు వేయాలి. మనం శాశ్వతం కాదు. మనం చేసే పనులు శాశ్వతం అని విశ్వసించే నాయకుడు చంద్రబాబు. రాష్ట్రంలో అన్యాయాన్ని ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరం చేయి చేయి కలపాలి. స్వతంత్ర పోరాట స్ఫూర్తిని మనలో ఇనుమడింపజేసుకోవాలి.' అని మహిళలకు పిలుపునిచ్చారు నారా భువనేశ్వరి. **మహిళల కామెంట్స్..** ఇదే సమయంలో పలువురు మహిళలు వైసీపీ పాలనలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను, పడుతున్న కష్టాల గురించి చెబుతూ ఆవేదన వ్యక్తం చేశారు. 'చంద్రబాబు ప్రభుత్వంలో నిత్యావసర ధరలు పెరగలేదు. సంక్షేమం అందింది. జగన్ ప్రభుత్వంలో పది రూపాయిలు ఇచ్చి, వంద రూపాయలు లాక్కున్నాడు. ఉపాధి లేక కష్టాలు పడుతున్నాం. సహజ సంపదలు దోపిడితో రోడ్లు ధ్వంసం అయ్యాయి. రోడ్లలో ప్రయాణం అంటే భయమేస్తుంది. ఇసుక పనులకి వెళ్తుంటాం. మూడు నెలలు పనుంటుంది. మిగిలిన రోజులు ఉపాధి లేక కష్టపడుతున్నాం.' అని నారా భువనేశ్వరికి మహిళలు తమ కష్టాలను చెప్పుకున్నారు.

# ఏపీలో ఎన్నికలు ఆలస్యం... వైసీపీకి లాభమా.? నష్టమా..?

(మొదటి పేజీ తరువాయి)

ఓ పెద్ద సమస్య అయ్యే అవకాశం ఉంది. ఇక, కోడ్ అమల్లో ఉన్న కారణంగా.. పథకాలను అమలు చేయలే ని పరిస్థితి వెరసి వైసీపీకి ఎన్నికల ఆలస్యం విషంగా మారుతుందనే వాదన వినిపిస్తోంది.ఖర్చుకు వెనుకాడుతున్న నేతలు కూడా వైసీపీకి ఇబ్బందిగా మారింది. ఎన్నికలు అంటే చిన్న విషయం కాదు. బోలెడంత ఖర్చు ఉంటుంది. ఎన్నికల సమయంలో ఈ ఖర్చు ఊహించనంతగా ఉంటుంది. ఓ రెండు వారాల పాటు ఉధృతంగా ప్రచారం నిర్వహించడానికి అయ్యే ఖర్చును చాలా ఎక్కువ ఉంటుంది. హెలికాప్టర్లకు గంటల్లో రెంట్ చెల్లించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో రెండు నెలల పాటు వాటిని మెయిన్ టెయిన్ చేయడం సామాన్యమైన విషయం కాదు.ఈ ఖర్చులకు భయపడి కూడా వైసీపీ నాయకులు దూకుడు తగ్గించారని అంటున్నారు. నియోజవర్గాల్లో అభ్యర్థులు ఎలాగూ ప్రచారం చేస్తూంటారు. రాష్ట్ర స్థాయిలో ప్రచారం.. బహిరంగసభలు పెట్టాలంటే పెద్ద ఎత్తున ఖర్చు పెట్టుకోవాల్సి వస్తుంది. ప్రస్తుత పరిస్థితుల్లో అభ్యర్థులు తమ సొంత ఖర్చులు పెట్టుకోవ డమే కష్టంగా మారుతోంది. ఇలాంటి సమయంలో బహిరంగసభల ఖర్చులు అయితే ఇక భరించడం కష్టం అవుతుంది. అందుకే... ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత మాత్రమే పని ప్రారంభించేలా నాయకులు ఉన్నారు. ఇది ఏప్రిల్ 18న కానీ విడుదలయ్యే అవకాశం లేదు.

# వైసిపికి మరో షాక్.. కాంగ్రెస్‌లో చేసిన వైసీపీ కీలక నేత..!

(మొదటి పేజీ తరువాయి)

కప్పిన షర్మిల ఆయనను సాదరంగా పార్టీలోకి ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా ఎలీజా మాట్లాడుతూ సొంత పార్టీ నాయకులపై విమర్శలు చేశారు. తన పట్ల వైసీపీ నాయకులు కుట్రపూరితంగా వ్యవహరించారని తనకు సమాచారం ఇవ్వకుండానే ప్రాంతీయ సమన్వయకర్తలు సమావేశాలు పెట్టేవారని ఆరోపించారు. ఈ విషయం జగన్ దృష్టికి తీసుకెళ్లిన ఆయన పట్టించుకోలేదని వాపోయారు. కాంగ్రెస్ లౌకికవాద పార్టీ కావటం వల్లే ఆ పార్టీలో చేరినట్లు ఎలీజా వెల్లడించారు. ఇదే సమయంలో తనకు చింతలపూడి టికెట్ పై షర్మిల భరోసా ఇచ్చినట్లు స్పష్టం చేశారు.

# శ్రీశైలంలో పౌర్ణమి పూజలు.. శాస్త్రోక్తంగా లక్ష కుంకుమార్చన..!





**ఆంధ్ర ప్రగతి/శ్రీశైలం,మార్చి 24:**శ్రీశైల భ్రమరాంబికా మల్లిఖార్జున స్వామి అమ్మవార్ల క్షేత్రంలో ఫాల్గుణ మాస పౌర్ణమి ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. దీంతోపాటు లోక కళ్యాణార్థం పరివార దేవతలకు అర్చనలు అభిషేకాలు ఘనంగా జరిపించినట్లు ఈఓ డీ పెద్దిరాజు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆలయ ప్రాకారంలో స్వామి అమ్మవార్లను పల్లకిలో ఆశీనులజేసి ఆలయ ప్రదక్షణలుచేసి క్షేత్ర గిరిప్రదక్షిణ చేశారు. అర్చక వేదపండితులు నందిమ ండపం నుండి బయలువీరభద్రస్వామి ఆలయం మీదుగా శివనామస్మరణ చేస్తూ సాగిన గిరి ప్రదక్షిణలో యాత్రికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.పౌర్ణమి సంధ్యా సమయంలో శ్రీభ్రమరాంబ అమ్మవారికి లక్ష కుంకుమార్చన చేసి ఊయల సేవ, పల్లకి సేవ జరిపించారు. ప్రత్యేక పుష్పాలతో అలంకరించిన ఊయలలో స్వామి అమ్మవార్లను ఆశీనులను చేసి అర్చకులు అష్టోత్తర నామావళిని పఠించారు. ఉభయ దేవాలయాల్లో పౌర్ణమి ప్రత్యేక పూజా కార్యక్రమాలో భక్తులు పాల్గొనేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఏఈఓ హరిదాసు తెలిపారు.



# చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

**-విశ్వనగర్‌లో పర్యటించిన నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్**





**ఆంధ్ర ప్రగతి/నంద్యాల మార్చి 24:** రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే అది ఒక చంద్రబాబు తోనే సాధ్యమని నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ తెలియ జేశారు. ఈ సందర్భంగా నంద్యాల టౌన్ 17వ వార్డు విశ్వన గర్ నందు పర్యటనలో భాగంగా నంద్యాల టిడిపి జిల్లా ప్రధా న కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ గారు మాట్లాడుతూ పరిశ్రమలు ఏర్పాటు చేయడంలో యువతకు ఉపాధి కల్పించడంలో వైఎస్ఆర్సిపి ప్రభుత్వం గోరంగా విఫలమైందన్నారు. అలాగే నంద్యాలలో మౌలిక సదుపాయాలు కల్పించడంలో కూడా వైఎస్ఆర్సిపి ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రజలందరూ వీటన్నిటినీ గమనిస్తున్నారని రాబోయే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి వైసిపికి బుద్ధి చెప్తారన్నారు. అందుకోసమే విశ్వ నగర్ అంతా ఏకమై విశ్వనగర్లో టిడిపికి మెజారిటీ తీసుకురావాలని అలాగే ప్రజలను చైతన్య పరిచి భారీ మెజారిటీతో చంద్రబాబు నాయుడుని సీఎంగా చేసుకొని నంద్యాల ఎమ్మెల్యేగా ఫరూక్ ని గెలిపించుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మద్దయ్య , లాయర్ ఖాజా హుస్సేన్ , చాంద రెబల్ , శీను , కృష్ణ , షరీఫ్ , గఫూర్ అంజి , కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో బీజేపీ ఎంపీ అభ్యర్థులు వీరే..



**ఆంధ్ర ప్రగతి/అమరావతి మార్చి 24:** ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ పార్లమెంట్ అభ్యర్థుల పేర్లను అధిష్టానం ఖరారు చేసింది. టీడీపీ, జనసేనతో పొత్తుల్లో భాగంగా బీజేపీ ఆరు పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేస్తుంది. ఇందులో భాగంగా బీజేపీ ఆదివారం రాత్రి ప్రకటించిన 5వ విడత జాబితాలో ఆరు పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థుల పేర్లను ప్రకటించింది.బీజేపీ ఏపీ చీఫ్ దగ్గుబాటి పురందేశ్వరి రాజమహేంద్రవరం నుంచి పోటీ చేస్తున్నారు. నరసాపురం నుంచి భూపతిరాజు శ్రీనివాస వర్మ, తిరుపతి నుంచి వరప్రసాదరావు, రాజంపేట నుంచి మాజీ ముఖ్యమంత్రి, అరకు నుంచి కొత్తపల్లి గీత, అనకాపల్లి నుంచి సీఎం రమేశ్ పోటీ చేస్తారని అధిష్టానం వెల్లడించింది. అయితే అసెంబ్లీ అభ్యర్థుల పేర్లను ఇంకా వెల్లడించలేదు.

# ఏపీలో రోడ్డు ప్రమాదాలు.. ముగ్గురు మృతి

**ఆంధ్ర ప్రగతి/అమరావతి మార్చి 24:** ఏపీలో జరిగిన రోడ్డు వేర్వేరూ రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం చెందగా మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. నంద్యాల జిల్లా అయ్యలూరు జాతీయ రహదారిపై రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొనగా ఇద్దరు మృతి చెందారు. మృతులు నంద్యాల మసీదుపురానికి చెందిన వాసులుగా గుర్తించారు. ఈ ప్రమాదంలో మరో వ్యక్తికి తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను ఆస్పత్రికి తరలించారు.ఎన్టీఆర్ జిల్లా నందిగామ శివారు అనాసాగరం రహదారిపై జరిగిన మరో ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. సూపర్ లగ్జరీ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.




# యువత శక్తి సామర్థ్యాలను వైఎస్ఆర్ పార్టీ విజయానికి కృషి చేయాలి

**- ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి**

**ఆంధ్ర ప్రగతి/నంద్యాల మార్చి 24:** వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో యువత తమ యొక్క శక్తి సామర్థ్యాలను పార్టీ విజయానికి వినియోగించాలని, భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలవాలని నంద్యాల శాసనసభ్యులు శిల్పా రవి రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని దేవ నగర్, శ్యామ్ నగర్, వీసీ కాలనీ ప్రాంతంలోని యువకులు పెద్ద ఎత్తున ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి సమక్షంలో 27 అవార్డు వైఎస్ఆర్సిపి ఇంచార్జ్ దేవ నగర్ బాషా, మేస చంద్ర శేఖర్, భాస్కర్, కంటయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ పాంశావళి అధ్వర్యంలో వైయస్సార్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. యువతను ఎమ్మెల్యే సాదరంగా ఆహ్వానించి పార్టీ కండువాలను కప్పారు. ఈనెల 28వ తేదీ నంద్యాలలో నిర్వహించిన మేమంతా సిద్ధం బహిరంగ సభను దిగ్విజయం చేయాలని యువతకు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్ప రవి రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ అభివృద్ధి పాలన యువతను ఎంతో ఆకర్షించి పార్టీలో చేరేందుకు సిద్ధం కావడం అభినందనీయం అన్నారు. యువత



తమ యొక్క శక్తి సామర్థ్యాలను భవిష్యత్ తరాలకు మంచి చేసేందుకు వినియోగించాలని కోరారు. రాష్ట్రంలో అనేక సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టి, అమలు చేస్తూ యువతకు ఆదర్శంగా నిలిచి దిశా నిర్దేశాన్ని చేస్తున్న జగన్మోహన్ రెడ్డికి అందరం బాసటగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈనెల 28వ తేదీ నంద్యాలలో నిర్వహించనున్న మేమంతా సిద్ధం సభను దిగ్విజయం చేయాలని కోరారు. హసభలో మన సత్తా ఏంటో చూపించాలని తెలిపారు. అలాగే నంద్యాల పట్టణంలోని శ్యామ్ నగర్, దేవ నగర్, వీసీ కాలనీ ప్రాంతాలు గత ఎన్నో సంవత్సరాలు నుండి కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితుల్లో మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి ఎమ్మెల్యేగా అధికారం చేపట్టిన సందర్భంగా ఈ ప్రాంతాన్ని విస్తృతంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు అన్ని మౌలిక సదుపాయాలను కల్పించారన్నారు. ప్రత్యేకంగా ఈ మూడు ప్రాంతాలలో ఉత్సాహవంతులైన యువత అత్యధికంగా రాజకీయాల వైపు ఆకర్షింపబడుతున్నారని వీరం దరూ జగనన్న నాయకత్వంలో సైనికులు లాగా రానున్న ఎన్నికల్లో తమ యొక్క సత్తా ఏంటో చూపించాలని పిలుపునిచ్చారు. కేవలం 50 రోజులు మాత్రమే ఎన్నికలకు సమయం ఉందని, పార్టీ విజ యానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని వచ్చే 5 సంవత్సరాలు మీ అందరికీ సేవ చేసే భాగ్యం కల్పించాలని ఎమ్మెల్యే కోరారు. నేటి నుండి పార్టీలో చేరిన యువత అంతా శిల్పా కుటుంబ సభ్యులని, తన ఇంటి తలుపులు ఎల్లప్పుడూ తెరచి ఉంటాయని తెలిపారు. మీ సమస్యలు పరిష్కరించేందుకు నేను సిద్ధంగా ఉన్నానని భరోసానిచ్చారు. పార్టీలో చేరిన వారు భాస్కర్, రమణయ్య, కంటయ్య, శ్రీను ,దుర్గ, రవి, వెంకటేశ్వర్లు, పెద్ద దుర్గా, విజయ్, రమేష్, మాలి భాష, వారి పుత్ర బృందం పాల్గొన్నారు.

# కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన నియమ నిభందనలను తప్పనిసరిగా అమలు చెయ్యాలి

**- నిస్పక్షపాతంగ ఎన్నికలు జరిగేలా శక్తి వంచన లేకుండా పనిచేయాలి - ప్రశాంత ఎన్నికలే లక్షంగా పనిచేయాలి - చెక్ పోస్టులలో నగదు,అక్రమ మద్యం,గంజాయి మొదలగునవి ఆకమ రవాణా జరుగకుండా చర్యలు తీసుకోవాలి**

**- జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి**

**ఆంధ్ర ప్రగతి/నంద్యాల మార్చ్ 24:** నంద్యాల జిల్లా ఎస్పీ కె. రఘురెడ్డి ఆదివారంజిల్లా పోలీస్ కార్యాలయం నందు పోలీస్ అధికారులతో రాబోయే సార్వత్రిక ఎలక్షన్స్ గురించి రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది.ఈ మీటింగ్ నందు జిల్లాలోని అన్ని సబ్ డివిజన్లకు చెందిన పోలీసు అధికారులతో మాట్లాడుతూ జిల్లాలోని సిబ్బంది,అధికారులు ఎంతమంది ఎన్నికలను నిర్భయంగా నిస్పక్షపాతంగా ప్రశాంత వాతావరణంలో జరిగేలా వారిని ఎలా ఉపయోగించుకోవాలి అని వివిధ అంశాలపై రివ్యూ మీటింగ్ నిర్వహించి పలు సూచనలు చేశారు.జిల్లాలో ఏ



విధమైన ర్యాలీలు కానీ సభలు సమావేశాలు ఊరేగింపులు మొదలగునవి ఏవి జరిగినా సంబంధిత అధికారుల అనుమతి తీసుకోవాలి. లౌడ్ స్పీకర్లు ఉపయోగించుట కొరకు ఖచ్చితమైన పర్మిషన్ తీసుకొని ప్రచార వాహనాలను ఉపయోగించే సమయంలో ఎన్నికల నిబంధనకు లోబడి ఉండాలని ఆ విధంగా చర్యలు తీసుకోవాలి.శాంతిభద్రతలకు భంగం కలిగించే వారు (ట్రబుల్ మంగర్స్ )ఎవరైనా ఉన్నట్లయితే వారిని బైండోవర్ చెయ్యాలి.ప్రాంత,కుల, వర్గ విభేదాలు రెచ్చగొట్టే విధంగా ఎవరు ప్రవర్తించిన అటువంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి.ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల నియమ నిబంధనలు ఎవరు ఉల్లంఘించిన అట్టి వారిపై నిష్పక్షపాతంగా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి.మీ మీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న చెక్ పోస్ట్ లపై నిరంతరం నిఘా ఉంచి నగదు ,అక్రమ మద్యం ,గంజాయి మరియు ఇతర నిషేధిత వస్తువులు అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలి.ప్రస్తుతం క్రికెట్ ఐపీఎల్ మ్యాచ్ లు జరుగుతున్న నేపథ్యంలో క్రికెట్ బెట్టింగ్ లకు పాల్పడుతున్న వారిపై ప్రత్యేకంగా ప్రత్యేక నిఘా ఉంచి కట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి.శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై నిరంతరం నిఘా ఉంచి ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా చర్యలు తీసుకోవాలి.ప్రజాస్వామ్యంలో ప్రజలందరూ నిష్పక్షపాతంగా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ప్రశాంత వాతావరణం కల్పించే విషయంలో శక్తి వంచన లేకుండా పనిచేయాలని ఆదేశించారు.

# నంద్యాలలో శిల్పా కుటుంబానికి భారీ షాక్...

**- శిల్పా పాలన నచ్చక దూరమైపోతున్న వైఎస్ఆర్సిపి నాయకులు**
**- శిల్పా అత్యంత ముఖ్య అనుచరులు టిడిపిలో చేరిక**



**ఆంధ్ర ప్రగతి/నంద్యాల మార్చి 24:** నంద్యాల పట్టణంలోని 8వ వార్డు సంచి బట్టల వీధి సంబంధించిన శిల్పా కుటుంబానికి మరియు శిల్పాకు అత్యంత ముఖ్య అనుచరులైన షబ్బీర్ , అలీ వారి ముఖ్య అనుచరులు 70 మంది 8వ వార్డు టిడిపి ఇంచార్జ్



ఉప్పరి సురేష్ కుమార్ ఆధ్వర్యంలో టిడిపి జిల్లా కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ సమక్షంలో టిడిపిలో చేరారు వారికి ఫిరోజ్ టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఫిరోజ్ మాట్లాడుతూ.. గత 20 సంవత్సరాల నుంచి మున్సిపాలిటీని తమ ఆధీనంలో పెట్టుకొని నంద్యాలకు ఏమి చేయకుండా తన సొంత పనులకు వాడుకుంటున్నాడని అంతేకాకుండా శిల్పా వారి అనుచరులను విస్మరించడం వారిని దూరంగా పెట్టడం వారికి గౌరవం ఇవ్వకపోవడంతో వారు



మనస్థాపం చెంది ఈరోజు టిడిపిలోకి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. శిల్పా కుటుంబం ఎప్పుడు ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తూ వారి నమ్ముకొని ఉన్న నాయకులను విస్మరిస్తూ ఉంటారన్నారు. ఇంకా 50 రోజులలో శిల్ప కుటుంబ పాలన నుంచి నంద్యాలకు విముక్తి లభిస్తుందన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే నంద్యాలను నందనవనంగా చేస్తామన్నారు. అలాగే నమ్ముకున్న వారికి అండగా ఉంటామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# వైసీపీని వీడిన మరో ఎమ్మెల్యే.. షర్మిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



**ఆంధ్ర ప్రగతి/అమరావతి మార్చి 24:** ఏలూరు జిల్లా చింతలపూడి వైసీపీ ఎమ్మెల్యే ఎలీజా కాంగ్రెస్ పార్టీలో చేరారు.

హైదరాబాద్‌లో ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ఎమ్మెల్యేకు స్వాగతం తెలుపుతూ కాంగ్రెస్ కండువాను కప్పారు. రాబోయే ఎన్నికల్లో ఎలీజాకు అధికార వైసీపీ అధ్యక్షుడు, సీఎం జగన్ అవకాశం ఇవ్వకపోవడం, నియోజకవర్గం వైసీపీ అభ్యర్థిగా కంభం విజయరాజు పేరును ప్రకటించడంతో గత కొంతకా లంగా ఆయన అసంతృప్తితో ఉన్నారు.మరో వైసీపీ ఎమ్మెల్యే బీజేపీ గూటికి చేరుకున్న విషయం తెలిసిందే. తిరుపతి జిల్లా గూడురు వైసీపీ ఎమ్మెల్యే వరప్రసాద్ ఢిల్లీలో కేంద్రమంత్రి అనురా గ్ ఠాకూర్, ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ థావడే సమక్షంలో బీజేపీలో ఆదివారం చేరారు. సీఎం వైఎస్ జగన్ వరప్రసాద్‌కు మరోసారి టికెట్ నిరాకరించడంతో ఆయన పార్టీ మారారు. గతంలో వరప్రసాద్ 2014 తిరుపతి వైసీపీ ఎంపీగా, 2019లో వైసీపీ ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు.

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా ప్రైవేట్ స్కూల్ టీచర్లకు హెల్త్ కార్డుల పంపిణీ

**- ప్రైవేట్ పాఠశాల అధ్యక్షులు దండే దస్తగిరి, సెవెన్ హిల్స్ హాస్పిటల్ ఎం.డి మారుతి ఆధ్వర్యంలో హెల్త్ కార్డుల పంపిణీ**

**ఆంధ్ర ప్రగతి/నంద్యాల మార్చి 24:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా ప్రవేట్ స్కూల్ టీచర్లను గుర్తించి ప్రవేట్ స్కూల్ టీచర్ల ఆరోగ్యం కొరకు ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ రాయలసీమ రీజియన్ అధ్యక్షులు దండే దస్తగిరి సంకల్ప బలంతో సెవెన్ హిల్స్ హాస్పిటల్ సౌజన్యంతో హెల్త్ కార్డులు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షులు దండే దస్తగిరి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా ప్రైవేటు ఉపాధ్యాయులకు సెవెన్ హిల్స్ హాస్పిటల్ ఎం.డి మారుతి ని సంప్రదించగా వెనువెంటనే పెద్ద మనసు చేసుకొని ప్రవేటు ఉపాధ్యాయుల కష్టాలను గుర్తించి వారి ఆరోగ్యత భద్రత కోసం అన్ని సదుపాయాలలో 50%



రాయితీతో హెల్త్ కార్డులు మంజూరు చేస్తానని హామీ ఇవ్వడం జరిగిందనీ, అందులో భాగంగా ఈరోజు సెవెన్ హిల్స్ హాస్పిటల్ దగ్గర 20 ప్రైవేటు పాఠశాలలకు సంబంధించిన 300 మంది ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు ఇవ్వడం జరిగిందని, ప్రైవేట్ పాఠశాల కరస్పాండెంట్లు కూడా వారి ఉపాధ్యాయుల అభ్యున్నతిని ఆశించి వెనువెంటనే స్పందించి వారి వివరాలను అందజేయడం జరిగిందని తెలిపారు. సెవెన్ హిల్స్ హాస్పిటల్ ఎం.డి మారుతి మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయుల కోసం దండే దస్తగిరి మంచి నిర్ణయానికి నావంతు సహసహకరలు అందించడం జరిగిందని, ఉపాధ్యాయుల నుంచి పెద్ద ఎత్తున స్పందన రావడం జరిగిందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పెద్ద మనసు చేసుకొని ప్రవేటు పాఠశాలల ఉపాధ్యాయులమైన మా గురించి ఆలోచించి మా ఆరోగ్య భద్రత కోసం మంచి నిర్ణయం తీసుకున్న ప్రైవేటు పాఠశాలల అధ్యక్షులు దండే దస్తగిరికి, సెవెన్ హిల్స్ హాస్పిటల్ ఎండి మారుతికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ స్కూల్ కరస్పాండెంట్ ఖలీల్, సన్రైజ్ స్కూల్ కరస్పాండెంట్ భాస్కర్, సెవెన్ హిల్స్ హాస్పిటల్ వైద్యులు సిబ్బంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నంద్యాలలో మేము సిద్ధం సభను విజయవంతం చేయండి

**- ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి**

**ఆంధ్ర ప్రగతి/నంద్యాల మార్చి 24:** నంద్యాలలో ఈనెల 28వ తేదీన నిర్వహించనున్న మేము సిద్ధం సభను విజవంతం చేయాలని నంద్యాల ఎమ్మెల్యే శిల్పారవిరెడ్డి వైఎస్సార్ పార్టీ నాయకులను, కార్యర్తలను, పార్టీ శ్రేణులను కోరారు. ఈ మేరకు నంద్యాల మున్సిపల్ టౌన్ హాల్ నందు ఎమ్మెల్యే శిల్పా రవిరెడ్డి ఆద్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులతో కలిసి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇసాక్ బాష, రాష్ట్ర మార్కెఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నీసా, వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, నంద్యాల ఎంపీపీ శెట్టి ప్రభాకర్, గోస్పాడు ఎంపీపీ ఆర్థర్పైమన్, పాంషావలి, మార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు ప్రహల్లాదరెడ్డి, విజయశేఖర్రెడ్డి, పురుషోత్తం రెడ్డి, రాష్ట్ర వివిధ శాఖల డైరెక్టర్లు శశికళారెడ్డి, సునీత అమృతరాజ్, చంద్రశేఖర్, కలాం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పారవిరెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్రెడ్డి నంద్యాలలో ఈనెల 28వ తేది నిర్వహించనున్న మేమంతా సిద్ధం సభను పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన 5 సంవత్సరాలలో కేవలం 3 సంవత్సరాలలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి చేపట్టిన ఏకైక నాయకుడు జగన్ మోహన్రెడ్డి అన్నారు. 2 సంవత్సరాల కాలంలో



నాయకులు ప్రజల ప్రాణాలకు కాపాడటానికి శ్రమించారని తెలిపారు. గ్రామాలను, పట్టణాలలో గ్రామ సచివాలయాలు, వార్డు సచివాలయాలు, ఆర్బీకే సెంటర్లు, హెల్త్ సెంటర్లు, అమృత్ నీటి పథకం, సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు, మౌలిక సదుపాయాలను కల్పించడం జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్సీపీకి మరో అవకాశం కల్పించాలని అభివృ ద్ధి, సంక్షేమం చేపట్టేందుకు సహకారం అందించాలని కోరారు. వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, అభిమానులు, కలిసికట్టుగా కృషిచేయాలని రాష్ట్రంలో, నంద్యాలలో వైఎస్సార్సీపీ జెండా ఎగురేయాలని కోరారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇడుపులపాయ నుండి ప్రారంభించనున్న మేమంతా సిద్ధం సభ కొనసాగుతూ ఈనెల 28వ తేది నంద్యాలలో నిర్వహించనున్న సందర్భంగా మనమంతా సిద్ధం కావాలని విజయవంతం చేయాలని కోరారు.



ఈ కార్యక్రమంలో నంద్యాల పట్టణ క్లస్టర్ అధ్యక్షులు పున్నా శేషయ్య, పడకండ్ల సుబ్రమణ్యం, జాకీర్ హుసేన్, నంద్యాల టౌన్ జేసీఎస్ కన్వీనర్లు సలాముల్లా, సాయిరాంరెడ్డి, అమీర్, కుమ్మరి రాముడు, నంద్యాల మండల జేసీఎస్ కన్వీనర్ బసవేశ్వరరెడ్డి, గోస్పాడు మండల జేసీఎస్ కన్వీనర్ జనార్ధన్రెడ్డి, డా. రాకేష్ రెడ్డి జోనల్ ఇంచార్జి శంకరానాయక్, వైఎస్సార్సీపీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ కారురవికుమార్, జాయింట్ సెక్రటరీ, రాష్ట్ర మైనార్టీ సెల్ జాయిట్ సెక్రటరీ గౌస్పీర్, వైఎస్సార్సీపీ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, నంద్యాల, గోస్పాడు మండలాల సర్పంచ్లు, ఎంపీటీసీలు, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ చిమ్మా నాగన్న, మాజీ కౌన్సిలర్లు, వైఎస్సార్సీపీ నాయకులు నాయకులు దేశం సుధాకర్రెడ్డి, జయసింహారెడ్డి, ఆర్పి సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# డబ్బుతో తిప్పికొడదాం !

**- అవినీతి మరకలను చెరిపేద్దాం**
**- ఓటర్లను మభ్యపెట్టొచ్చన్న ధీమా**
**- అధికార పార్టీ నాయకుల ఉత్సాహం**
**- పార్టీ కేడర్ను పట్టించుకోని నేతలు**

**ఆంధ్ర ప్రగతి/భీమవరం,మార్చి 24:** జిల్లాలోని వాణిజ్య కేంద్రమైన పట్టణంలో అధికార పార్టీ నేత బూత్ స్థాయి ఇన్ఛార్జ్లతో సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అందరికీ సమా చారం అందించారు. ఇన్ఛార్జ్ల నుంచి స్పందన లేదు. దాంతో సమావేశం వాయిదా వేసుకున్నారు. అదే నియోజకవర్గంలో 35 వేల మెజారిటీతో కూటమి విజయం సాధిస్తుందంటూ అధికార పార్టీ అధిష్టానానికి సర్వే బృందం నివేదిక ఇచ్చింది. వాస్తవానికి సదరు నేతకు టిక్కెట్ ఇవ్వకూడదంటూ అధిష్ఠానం నిర్ణయించింది. చివరకు అ?ధికార పార్టీ నేత సోదరుడు రంగంలోకి దిగారు. సీటు గెలిచి చేతిలో పెడతామంటూ జగన్కు మాటిచ్చారు. డబ్బులు ఖర్చు పెట్టయినా నెగ్గుకు వస్తామంటూ అధినేత వద్ద పట్టుబట్టి టిక్కెట్ తెప్పించు కున్నారు. ఇలా పార్టీ కేడర్లోనూ ప్రజల్లోనూ ఆదరణ కంటే డబ్బుతోనే నెగ్గ కొస్తామనే ధీమాలో జిల్లాలోని అధికార పార్టీ నేతలు ఉన్నారు. అధికారంలో ఉన్నప్పుడు కేడర్ను పట్టించుకోలేదు. వారి బాగోగులను చూసుకోలేదు. పార్టీ శ్రేణులు ఆర్థికంగా నష్టపోయాయి. స్థానిక సంస్థల్లో వైసీపీ కోసం లక్షలు వెచ్చించి గెలిచిన నాయకులంతా అప్పుల పాలయ్యారు. వారిని గట్టెక్కిద్దామన్న పరిస్థితులు అటు పారీలోనూ,ఇటు నియోజకవర్గ నాయకత్వంలోనూ లేకుండా పోయింది. మరోవైపు అవినీతి, అక్రమాలతో నియోజకవర్గ నేతలు కోట్లు గడించారు. కేడర్ను విస్మరించారు. ఇప్పుడదే అధికార పార్టీని వెంటాడుతోంది. నాయకులంతా పార్టీని వీడుతున్నారు. పార్టీని నెగ్గించడంలో కీలకంగా వ్యవ హరించిన వారంతా ఇప్పుడు దూరంగా ఉంటున్నారు. కేవలం డబ్బుతోనే ఓటర్లను తమవైపు తిప్పుకోవాలన్న తలంపుతో అధికార పార్టీ అభ్యర్థులు న్నారు. కూటమి అభ్యర్థుల ఢీకొట్టేందుకు డబ్బు ఒక్కటే ప్రధాన వనరుగా చూసుకుంటున్నారు.



**భవనాలకు సొమ్ములు తీసుకుంటారా ?**

తాడేపల్లిగూడెంలో భవనాలు నిర్మిస్తే అధికార పార్టీ నేత సొమ్ములు తీసు కుంటారట కదా అంటూ ఓ మహిళ వ్యాఖ్యానించింది. ఇప్పుడిదే పట్టణంలో గొడవగా ఉందంటూ చెప్పుకొచ్చింది. అంటే తాడేపల్లిగూడెంలో అధికార పార్టీ అవినీతి దందా ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. భవన నిర్మాణాలు చేప ట్టిన ప్రతి యజమాని నుంచి సొమ్ములు వసూలు చేశారు. టీడీఆర్ బాండ్ల జారీలోనూ పెద్ద మొత్తంలో అవినీతి జరిగింది. పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాల్లోనూ అక్రమార్జన చేశారు. ఇప్పుడదే అధికార పార్టీకి నీడలా వెంటాడుతోంది. కేవలం డబ్బు అధికంగా ఇచ్చి నెట్టుకు రావాలన్న తలంపుతో పార్టీ ఉంది. ఇప్పటికే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఉన్న నేతలంతా దూరమయ్యారు.చివరి దశలో అధికార పార్టీ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

**ఇక్కడ కూడా దూరమైన కేడర్**

తణుకు నియోజకవర్గంలో అధికార పార్టీ నేతకు కుడి, ఎడమలుగా ఉన్న నాయకులంతా రాజీనామా బాటపట్టారు. తణుకులోనూ అవినీతి దందా నిర్వహించడంలో అధికార పార్టీ నేత తక్కువేమీ కాదు. టీడీఆర్ బాండ్ల కుంభకోణం అధికార పార్టీ మెడకు చుట్టుకుంది. భవన నిర్మాణాల్లోనూ కమీషన్లు ఇచ్చే పరిస్థితి నెలకొంది. అక్కడ కూడా పార్టీ కోసం పాటుపడ్డ వారిని పక్కన పెట్టేశారు. సొంత ప్రయోజనాలకే పెద్దపీట వేశారు. దాంతో విసిగిపోయిన ముఖ్య నాయకులంతా పార్టీకి దూరంగా ఉంటున్నారు. కొందరు రాజీనామాలు చేసేశారు. ఇక ఆచంట నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణాతో అధికార పార్టీ నాయకులు దందా సాగించారు. కోట్లు కొల్లగొట్టారు. జగనన్న కాలనీల్లో భూసేకరణ విషయంలోనూ పెద్ద మొత్తంలో చేతులు మారాయి. ఇదే విషయమై ఎంపీ రఘురామకృష్ణంరాజు తొలుత లేవనెత్తారు. మొత్తంపైన ఇసుక దందాలో కొందరు అధికార పార్టీ సర్పంచ్లు కీలకంగా వ్యవహరించారు. ఇలా అతికొద్ది మందికే అక్కడ లబ్ధి చేకూరింది. పార్టీలో ఒక బలమైన సామాజిక వర్గానికి కూడా ఏమీ చేయలే దనన్న అసంతృప్తి ఆచంటలో నెలకొంది. ఇలా కొన్ని వర్గాలు, కేడర్ పార్టీకి దూరంగా ఉంటోంది. నర్సాపురంలోనూ అధికార పార్టీ నేత బినామీ ఆస్తులు కూడ గట్టుకున్నారన్న విమర్శలు తారస్థాయికి చేరిపోయాయి. భీమవరంలో మట్టి దందాతో పాటు, లేఅవుట్లలో అక్రమాలు చోటు చేసుకున్నాయన్న వాదన బలంగా ఉంది. అధికార పార్టీ నేతను ఇదే వెంటాడుతోంది. ఇలా అధికార పార్టీ నేతలపై అవినీతి మరక అంటుకుంది. వారంతా ఇప్పుడు డబ్బులతోనే ఓటర్లను మభ్యపెట్టవచ్చనే భ్రమలో ఉన్నారు.

## చంద్రబాబును కలిసిన మందకృష్ణ మాదిగ .. తాజా రాజకీయ పరిస్థితులపై చర్చ



**ఆంధ్ర ప్రగతి/అమరావతి మార్చి 24:** ఎమ్మార్పీయస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడును ఆదివారం విజయవాడలోని ఉండవల్లి నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా వీరిద్దరి మధ్య ఏపీలో రాజకీయ పరిణామాలు, పరిస్థితులపై చర్చిం చుకున్నారు.ఎన్డీయేలో టీడీపీ చేరికతో ఏపీలో కూటమికి మద్దతివ్వాలని ఆయన తీసుకున్న నిర్ణయం మేరకు చంద్ర బాబును కలవడం రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎంఎస్ రాజుకు ప్రత్యామ్నాయం చూడాలని బాబును ఆయన కోరారు. అనంతరం మాదిగల అభ్యున్నతికి సహకరించాలని చంద్రబాబుకు వినతిపత్రం అందజేశారు.సార్వత్రిక ఎన్నికల్లో ఏపీలో ఎన్డీఏ కూటమికి మద్దతు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ నిర్ణయం తీసుకుందని తెలిపారు. మాదిగల ఆకాంక్షలను చంద్రబాబు ముందు పెట్టామని, టీడీపీ, బీజేపీ(, జనసేనకూటమి రాబోయే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చాక మొదటి ప్రాధాన్యతలో అవన్నీ నెరవేరుస్తానని, కూటమి అధికారంలోకి రాగానే తొలి అసెంబ్లీ సమావేశాల్లో వర్గీకరణకు అనుకూలంగా బిల్లు పెడతామని హామీ ఇచ్చారని తెలిపారు.

## సినిమా వాళ్లు రాజకీయాలకు పనికిరారు.. కాపునేత ముద్రగడ సంచలన వ్యాఖ్యలు



**ఆంధ్ర ప్రగతి/అమరావతి మార్చి 24:** ఏపీ కాపునేత ముద్రగడ పద్మనాభం సంచలన వ్యాఖ్యలు చేశారు. సినిమా వాళ్లు రాజకీయాల్లో పనికిరారని పరోక్షకంగా చిరంజీవి, పవన్కల్యాణ్ ఉద్దేశించి అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజారాజ్యం పార్టీ స్థాపించిన చిరంజీవి అనతికాలంలోనే పార్టీ జెండాను ఎత్తివేశారని, పవన్ కల్యాణ్ కూడా అదే దారిలో పయనిస్తాడని అన్నారు. ఏపీలో 175 అసెంబ్లీ, 25 ఎంపీ సీట్లు ఉండగా కేవలం 20 సీట్లకు మాత్రమే జనసేన అధినేత పరిమితమవడం శోచనీయమని అన్నారు.20 సీట్ల కోసం పవన్కు నేను ఎందుకు సపోర్ట్ చేయాలని, ఒక ఎంపీ, ఎమ్మెల్యే లేకుండా పార్టీ పెడితే నేను వెళ్లాలా అంటూ ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో పిఠాపురం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న పవన్కల్యాణ్ ఓడిపోవడం ఖాయమని పేర్కొన్నారు. చంద్రబాబు తనను అనేక ఇబ్బందులకు గురిచేశాడని, చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఓటమి కోసం పనిచేస్తానని వెల్లడించారు. ఏపీలో మరో 30 ఏళ్ల పాటు జగన్ సీఎంగా ఉంటారని జోస్యం చెప్పారు.

## పెళ్లైన 11 రోజులకే విద్యుదాఘాతంతో సర్వేయర్ మృతి.. కుటుంబంలో విషాదఛాయలు

**ఆంధ్ర ప్రగతి/అమరావతి మార్చి 24:** నెల్లూరు జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. అప్పటి వరకు మేళతాళాలు, బంధువుల సందడితో కళకళలాడిన ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది. పెళ్లైన 11 రోజులకే విద్యుదాఘాతంతో మృత్యువాతపడడం రెండు కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.అమరావతి : నెల్లూరు జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. అప్పటి వరకు మేళతాళాలు, బంధువుల సందడితో కళకళలాడిన ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది. పెళ్లైన 11 రోజులకే విద్యుదాఘాతంతో మృత్యువాతపడడం రెండు కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

